సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

రేపటి నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో బుధవారం నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తుపాన్ నేపథ్యంలో మంగళవారం నుంచి బుధవారానికి మార్పు చేశారు. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షల నిర్వహణకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల నిర్వహణ, పరీక్ష కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టారు. వర్సిటీకి అనుబంధంగా 99 డిగ్రీ కళాశాలలు ఉండగా, 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు డిగ్రీ కోర్సులు బీఎస్సీ, బీఏ, బీకాం, బీబీఎంల నుంచి రెగ్యులర్‌గా 7042, సప్లిమెంటరీ విధానంలో 3439 మంది హాజరు కానున్నారు. 10481 మంది హాజరయ్యారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కొత్తూరు: మండల కేంద్రంలోని పాలకొండ రోడ్డులో గిరిజన కార్పొరేషన్ స్థలంలో ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ సోమవారం స్థల పరిశీలన చేశారు. స్థలానికి సంబంధించిన రికార్డులతో పాటు సమగ్ర వివరాలను తహసీల్దారు చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. వివరాలను నివేదిక అందించాలని ఆదేశించారు.

బాలుడు అదృశ్యం


సాగర్ ప్రదీప్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తిలక్‌నగర్‌కు చెందిన సాగర్ ప్రదీప్ అనే బాలుడు అదృశ్యమైనట్లు తల్లి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఏడున్నర గంటల నుంచి కనిపించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేస్టేషన్‌లోని చైల్డ్ లైన్ సిబ్బందిని కూడా సంప్రదించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ముగ్గురు ఫార్మసిస్ట్‌లకు పదోన్నతులు


పదోన్నతుల ఉత్తర్వులను నరసింగరావుకు అందిస్తున్న ఆర్డీ సుజాత

అరసవల్లి: జిల్లాలో వైద్యారోగ్య శాఖ పరిధిలో పలు పీహెచ్‌సీల్లో జోనల్ క్యాడర్‌లో గ్రేడ్-2 ఫార్మసిస్టులుగా పనిచేస్తున్న ముగ్గురికి గ్రేడ్-1 ఫార్మసిస్టులుగా పదోన్నతులు కల్పించడంతో పాటు కొత్త స్థానాలకు బదిలీ చేస్తూ వైద్యారోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ సుజాత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో తిలారు పీహెచ్‌సీలో పనిచేస్తున్న బమ్మిడి నరసింగరావుకు విజయనగరం జిల్లా ఆస్పత్రికి, బూర్జ పిహెచ్‌సిలో పనిచేస్తున్న గురుమూర్తికి విజయనగరం ఆస్పత్రికి, అలాగే తిలారులోనే పనిచేస్తున్న తులసీకి శ్రీకాకుళం రిమ్స్‌లో గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, 5 సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనల్ని సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియజేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల ఎస్‌ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్‌ఈల్ని ఆదేశించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమండ్రి సర్కిల్‌లోనూ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఏవీవీ సూర్యప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912, వాట్సాప్ నంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని సూచించారు.

చినుకు.. వణుకు

చినుకు వణికిస్తోంది. మిచాంగ్ ప్రభావంతో జిల్లా అంతటా చిరుజల్లులు కురిశాయి. దీంతో రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది. కోతలు కోసిన వారు వెంటనే కుప్పలు పెట్టుకున్నారు. నూర్పు మొదలుపెట్టిన వారు ఆందోళనకు గురి కాగా.. ప్రభుత్వం ఆపత్కాలంలో ఆదుకుంది. ఆఫ్‌లైన్ పద్ధతిలో ధాన్యం సేకరించాలని ఆదేశించడంతో ఎక్కడికక్కడ అధికారులు ధాన్యంను మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు. మరోవైపు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తీరంలో గస్తీ కాశారు.


టెక్కలి : తుఫాన్ భయంతో వరి కుప్పలు పెడుతున్న రైతులు

- జిల్లా వ్యాప్తంగా గాలులు, వర్షాలు
- టాస్క్‌ఫోర్స్ అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్
- మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు
- ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు
- కొత్త విద్యుత్ స్తంభాలతో విద్యుత్ సిబ్బంది సిద్ధం

శ్రీకాకుళం:

మిచాంగ్ ప్రభావం జిల్లాపై కనిపించింది. సోమవారం వేకువజాము నుంచి పలుచోట్ల ఈదురుగాలులు వీచాయి. వానలు కురిశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కలెక్టర్లను అప్రమత్తం చేసింది. దీంతో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా ఉండేలా మత్స్యకార గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిస్థితిని కంట్రోల్ రూంకు, జిల్లా అధికారులకు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ కారణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఉద్యోగుల సెలవులు రద్దు

జిల్లాలో కీలక శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే సెలవులో ఉన్నవారు కూడా విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం అనుకుంటే ఆయా శాఖల ఉద్యోగులు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి సేవలు అందివ్వాలన్నారు. అగ్నిమాపక, పోలీసు శాఖలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం తుఫాన్ తీరం దాటే రెండు మూడు గంటల ముందు నుంచి ఆ తర్వాత 10 గంటల వరకు తీవ్రంగా ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉంటుందని, భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలన్నారు.

విద్యుత్ సిబ్బంది సిద్ధం

అరసవల్లి: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్‌ఈ ఎన్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో డివిజినల్, సబ్‌డివిజన్ ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, వజ్రపుకొత్తూరు, పలాస, టెక్కలి, సంతబొమ్మాళి, పోలాకి, శ్రీకాకుళం రూరల్, గార, ఎచ్చెర్ల, రణస్థలం తదితర మండలాల్లో తుపాను ప్రభావాన్ని అంచనా వేస్తూ అందుకు తగ్గట్టుగా సామగ్రి, సిబ్బందిని సిద్ధం చేశారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస, పాలకొండ విద్యుత్ డివిజన్లలో మొత్తం శాఖలోని 1400 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు 70 బ్యాచ్‌లుగా సుమారు 750 మంది కార్మికులను కూడా పునరుద్ధరణ పనులకు సిద్ధం చేశారు. తుఫాన్ ప్రభావమున్న మండలాలకు ఒక్కో అధికారిని ప్రత్యేక నోడల్ ఆఫీసర్లుగా ఎస్‌ఈ కృష్ణమూర్తి నియమించారు. అలాగే తీవ్ర గాలులతో విద్యుత్ స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉన్న అంచనాలతో సుమారు 13,033 విద్యుత్ స్తంభాలను, 421 కిలోమీటర్ల మేర కండక్టర్లు, అలాగే 961 ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్)ను, 15 వరకు పోల్ డ్రిల్లింగ్ మిషన్లను సన్నద్ధం చేశారు.

కాల్‌సెంటర్లు నంబర్లు ఇవే..

టోల్‌ఫ్రీ	1912
శ్రీకాకుళం సర్కిల్	9490612633
శ్రీకాకుళం డివిజన్	9440635529
టెక్కలి డివిజన్	9490610050
పలాస డివిజన్	7396615568
పాలకొండ డివిజన్	8332843546

నాలుగు డివిజన్ కేంద్రాల్లో కాల్‌సెంటర్లు ఏర్పాటు



మిచాంగ్ తుపాను ప్రభావం జిల్లాలో తీవ్రంగా ఉండే అవకాశాలున్నట్లుగా హెచ్చరికల దృష్ట్యా తీర ప్రాంత మండలాల్లో ముందస్తు చర్యలు చేపట్టాం. జిల్లాలో నాలుగు విద్యుత్ డివిజన్లలోనూ కాల్ సెంటర్లను ఏర్పాటు చేశాం. సర్కిల్ కార్యాలయంలో ఎల్‌ఎంసీ సెంటర్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. తీర ప్రాంత మండలాల్లోని 23 సబ్‌స్టేషన్లకు ఇన్‌చార్జిలను, అలాగే మండలానికొక నోడల్ ఆఫీసర్‌ను నియమించాం. సామగ్రి, సిబ్బందిని తగినంతగా సిద్ధం చేశాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్‌ఈ, విద్యుత్ సర్కిల్

ఆపత్కాలంలో అన్నదాతకు సాయం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తుఫాన్ నేపథ్యంలో రైతులు నష్టపోకూడదని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధాన్యం కొనుగోలుకు ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేస్తోంది. దీనిలో భాగంగానే జిల్లాలో 626 రైతుభరోసా కేంద్రాలకు 390 పీపీసీ (పేడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్స్)ను ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పొలంలో బస్తాలను ఆర్బీకేలకు తీసుకొచ్చేందుకు కూడా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోంది. గోనె సంచులకు 40కేజీల సంచికి రూ 3.37పైసలు, 80 కేజీల సంచికి రూ 6.68పైసలు అందిస్తున్నారు. క్వింటా ధాన్యం ఎత్తిన కూలి రూ.17.17, రవాణా ఖర్చు దూరాన్ని బట్టి సున్నా నుంచి 8కిలోమీటర్ల లోపు టన్నుకి రూ. 280 అందిస్తారు. గన్నీలేబర్, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇప్పటి వరకు జలుమూరు మండలంలోని 7 ఆర్బీకేల నుంచి 447.247 టన్నులు, సారవకోట మండలంలో ఒక్క ఆర్బీకే నుంచి 189.689 టన్నులు, నరసన్నపేటలో 7 ఆర్బీకేల నుంచి 47.920 టన్నులు, హిరమండలం ఒక్క ఆర్బీకే నుంచి 10 టన్నులు మొత్తం ఆన్‌లైన్ ద్వారా 694.840 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు. ఆఫ్‌లైన్ ద్వారా సుమారు మరో 700 టన్నుల వరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. క్వింటాకు మద్దతు ధర గ్రేడ్-ఎ ధాన్యంకు రూ.2,203, సాధారణ రకం 2,183 ఇస్తున్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ఆర్బీకేలను సంప్రదించి ధాన్యాన్ని విక్రయించాలని ప్రభుత్వం కోరుతోంది.


జలుమూరు: పాగోడు నుంచి ధాన్యం తరలిస్తున్న వ్యవసాయ అధికారులు,రైతులు

ఆపదలో ఆదుకున్నారు..

కాశీబుగ్గ: పలాస మండలం మహదేవుపురం గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు ధాన్యం నూర్పులు చేసి కళ్లంలో ఉంచేశారు. తుఫాన్ వానలతో వారు పంట తడిచిపోతుందేమోనని ఆందోళనకు గురయ్యారు. దీనిపై అధికారులకు సమాచారం అందించగానే.. పలాస తహసీల్దార్ లంబాల మధుసూదనరావు ప్రత్యేక చర్యలు చేపట్టి సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం తరలించారు. మహాదేవపురం గ్రామానికి చెందిన మజ్జి జగన్నాయకులకు చెందిన 36 బస్తాలు, మజ్జి కృష్ణారావుకు చెందిన 50 బస్తాలు, బూర్లి కాంతమ్మకు చెందిన 36 బస్తాలతో పాటు మరికొంతమంది చిన్నరైతులవి తరలించారు. అధికారుల తక్షణ స్పందన రైతులను కదిలించింది.


మహదేవుపురం నుంచి ధాన్యం బస్తాల తరలింపు పర్యవేక్షిస్తున్న ఆర్‌బీకే ఉద్యోగులు

126.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు


శ్రీకాకుళంలో వానలో వెళ్తున్న వాహనదారులు

శ్రీకాకుళం: జిల్లాలో సోమవారం రాత్రి 7గంటల వరకు మొత్తం 126.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఆమదాలవలసలో 15.8 మిల్లీమీటర్లు నమోదు కాగా, శ్రీకాకుళంలో 14.3, లావేరులో 13 మిల్లీమీటర్లు, గార, రణస్థలంలో 11.8 మిల్లీమీటర్లు, పోలాకిలో 8.4 మిల్లీమీటర్లు, ఎచ్చెర్లలో 7.5, నరసన్నపేటలో 6.8, సరుబుజ్జిలిలో 6.3, కోటబొమ్మాళిలో 5.8, ఎల్.ఎన్.పేట 4.3 మిల్లీమీటర్లు, జలుమూరులో 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మెళియాపుట్టిలో 3.2 మిల్లీమీటర్లు, సంతబొమ్మాళి, హిరమండలంలో 2.8 మిల్లీమీటర్లు, నందిగాంలో 2.5, టెక్కలిలో 1.5 మిల్లీమీటర్లు, పాతపట్నంలో 1.3 మిల్లీమీటర్లు, కొత్తూరు, మందస, పలాసల్లో 1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు విద్యా సంస్థలకు సెలవు



తుఫాన్ ప్రభావంతో మంగళవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. సోమ, మంగళవారాల్లోని రెండు సెలవులకు బదులుగా మరో రెండు రోజులు సెలవు దినాల్లో విద్యా సంస్థలు పనిచేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

12 గంటలు ఒంటరిగా సముద్రంలోనే!


మత్స్యకారుడు చీకటి దుర్యోధనను పరామర్శిస్తున్న సచివాలయ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: తుఫాన్ నేపథ్యంలో సంద్రంలోకి వెళ్లిన ఓ మత్స్యకారుడు దారి తప్పి 12 గంటల పాటు ఒంటరిగా జలధిలోనే గడిపిన ఘటన డొంకూరులో చోటు చేసుకుంది. డొంకూరు గ్రామానికి చెందిన చీకటి దుర్యోధన, మరికొందరు మత్స్యకారులు వేర్వేరు తెప్పలపై సముద్రంలోకి వేటకు వెళ్లారు. చాలాసేపటి వరకు అంతా కలిసే వేట చేశారు. అయితే చీకటి పడుతోందనగా తుఫాన్ గాలుల ప్రభావంతో తోటి మత్స్యకారుల జట్టు నుంచి దుర్యోధన పడవ దారి తప్పిపోయింది. వేటకు వెళ్లిన వారంతా రాత్రి 9 గంటలకు ఒడ్డుకు చేరుకోగా.. దుర్యోధన మాత్రం రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు గురయ్యారు. ఆ చీకటిలో తన పడవ ఏ ప్రాంతానికి వెళ్తుందో గుర్తుపట్టలేని పరిస్థితిలో దుర్యోధన ఆకలితో, భయంతో బిక్కుబిక్కుమంటూ సూర్యోదయం వరకు గడిపాడు. తెలవారుతుండగా మందస మండలం గంగువాడకు చెందిన మత్స్యకారులు నాటుపడవలో ఎవరో ఉన్నట్లు గ్రహించి వెంటనే సురక్షితంగా బయటకు తీసుకువచ్చి భోజనం పెట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న మహిళా పోలీస్ షేక్‌మధర్బీ, వీఆర్వో ఢిల్లీరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, వైసీపీ నాయకులు కీలు ఉమాశంకర్, బుడ్డ కళ్యాణ్‌లు బాధితుడితో మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు మాన్విత

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు జిల్లాకు చెందిన వంగపండు లీలా మాన్విత ఎంపికైంది. ఈ మేరకు రాష్ట్ర స్కూల్‌గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి నుంచి సమాచారం అందింది. ఇటీవలి అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేదికగా జరిగిన 67వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14 బాలబాలికల వాలీబాల్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో జిల్లా జట్టు రాణించింది. ఇదే జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మాన్విత మెరుగైన ఆటతీరు కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు ఈనెల 22 నుంచి 26 వరకు భువనేశ్వర్‌లోని విట్ కాలేజ్ వేదికగా త్వరలో జరగనున్నాయి.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

శ్రీకాకుళం హడ్కోకాలనీలో నివాసం ఉంటున్న వీఎల్ మాన్విత.. నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. గత మూడేళ్లుగా తల్లిదండ్రులు వి.శ్రీరాములు, కె.సుశీల (పీడీ) ప్రోత్సాహంతో వాలీబాల్‌లో నిరంతరం సాధన చేస్తోంది. గత ఏడాది కూడా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రపోటీల్లో అత్యద్భుతంగా రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. మాన్విత అక్క వి.లిఖిత కూడా వాలీబాల్ క్రీడాకారిణి కావడం విశేషం. మాన్విత జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రభావతి, పీడీ కె.విజయ్‌కుమార్, కోచ్ కె.హరికృష్ణ, స్కూల్ గేమ్స్ సెక్రటరీ బీవీ రమణ, వాలీబాల్ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


వాలీబాల్ సాధనలో మాన్విత

మల్లన్న ఆదాయం రూ.8,10,282

టెక్కలి: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా టెక్కలి మండలం రావివలస మల్లన్న ఆలయానికి రూ.8,10,282 ఆదాయం వచ్చినట్లు ఉత్సవాల నిర్వాహణాధికారి వీవీఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. శీఘ్రదర్శనం ద్వారా రూ.2,74,000, శీర్షాభిషేకం ద్వారా రూ.2,92,040, కేశఖండన టికెట్‌ల ద్వారా రూ.28,520, హుండీల ద్వారా రూ.2,15,722 మొత్తం రూ.8,10,282 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,38,942 ఆదాయం తగ్గినట్లు పేర్కొన్నారు.

శ్రీముఖలింగం హుండీ ఆదాయం రూ.రెండు లక్షలు

జలుమూరు: శ్రీముఖలింగంలో కార్తీక సోమవారం సందర్భంగా హుండీ ఆదాయం రూ.2,00,493 వచ్చినట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. ఇందులో ప్రత్యేక దర్శనం రూ. 87,840, స్థలపురాణం, పుస్తకాల విక్రయం ద్వారా రూ.2520, కేశఖండన ద్వారా రూ. 1200, ప్రసాదాలు రూ. 32,490, గుడ్డ హుండీ రూ.75,323 తదితరవి మొత్తం రూ. 2,00,493 వచ్చిందని ఆయన తెలిపారు.

నాగావళి తీరంలో రక్షణ గోడలు


ముద్దాడపేట వద్ద రివర్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: నాగావళి నదీ పరివాహక గ్రామాల్లో వరదల నివారణ కోసం రివర్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మండలంలో ముద్దాడపేట, పీర్‌సాహెబ్‌పేట గ్రామాల్లో రూ. 96 లక్షల వ్యయంతో నిర్మించనున్న రివర్ ప్రొటెక్షన్ వాల్ (రక్షణ గోడ) నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. వరదలు వచ్చే సమయంలో నాగావళి నదికి ఆనుకుని ఉన్న గ్రామాలు కోతకు గురికావడంతో పాటు వరద నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తోందని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో వరదలను నివారించడానికి రక్షణ గోడ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించిందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని అన్నారు. బలసలరేవు బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సులువుగా ప్రయాణాలు చేయడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ పి.సుధాకర్, డీఈ ఎం.మురళీమోహన్, ఏఈఈ కె.రాంబాబు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఈఓపీఆర్డీ గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు గురుగుబెల్లి గిరి, బొడ్డేపల్లి శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల పరిశీలన



బీఎడ్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్, ఇంజినీరింగ్ ఏడో సెమిస్టర్, బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరు, పరీక్షలకు హాజరు శాతంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్‌లో 200 మందికి 200, ఆర్ట్స్ పీజీ కోర్సుల్లో 245కి 232, సైన్స్ పీజీ కోర్సుల్లో 348 కి 340 , బీఎడ్ 34 కి 34 మంది హాజరయ్యారు.

డీలర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రంజిత్



రంజిత్ కుమార్

సారవకోట: మండలంలోని మహాశింగి రేషన్ డిపో డీలర్ కె.రంజిత్ కుమార్ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకటరావు నుంచి లిఖిత పూర్వకంగా అందజేశారు. ప్రస్తుతం రంజిత్‌కుమార్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు మండల రేషన్ డీలర్లు, పలువురు సర్పంచ్‌లు, వైఎస్సార్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

ఊరంతా కలిసి ఆదుకున్నారు



మృతుని కుమార్తె అమృతకు సాయమందిస్తున్న దేవుపురం ప్రజలు

మందస: రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబ పెద్ద మరణిస్తే.. ఆ ఊరంతా కలిసి కుటుంబానికి అండగా నిలిచింది. మందస మండలంలోని దేవుపురం గ్రామానికి చెందిన నెయ్యిల రమేష్ కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేసేవారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. దీంతో రమేష్ కుటుంబాన్ని ఆదుకోవడానికి దేవుపురం గ్రామస్తులు ముందుకు వచ్చారు. ఊరంతా కలిసి రూ.2 లక్షలు విరాళాల రూపంలో సేకరించారు. రమేష్ పెద్ద కార్యం రోజున ఆయన కుమార్తె అమృతకు సోమవారం ఈ డబ్బును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సర్పంచ్ గేదెల పద్మనాభం, ఉప్పాడ రాజారావు, ఎం.నరేంద్ర(చిన్ని), పినకాన భాస్కరరావు, లంబాడ కిరణ్‌కుమార్, పి.ఉమాశంకర్, కె.బలరాం, మల్ల పాపారావు, యువకులు పాల్గొన్నారు.

లైంగిక దాడిపై కేసు నమోదు

రణస్థలం: మండలంలోని సంచాం గ్రామానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని అదే గ్రామానికి చెందిన ఇనపకుర్తి అప్పారావుపై కేసు నమోదు చేసినట్లు జేఆర్‌పురం ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. ఈ బాలికను అప్పారావు ప్రేమపేరుతో రెండేళ్లుగా వేధిస్తున్నాడని, ఇటీవల బాలిక ఆరోగ్యం విషయంలో తేడా రావడంతో కుటుంబ ఆరా తీస్తే అత్యాచారం జరిగినట్లు నిర్ధారణకు వచ్చిందని, దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దిశ డీఎస్పీ వాసుదేవరావు సంచాం గ్రామం వచ్చి ఇరు కుటుంబాలతో మాట్లాడి కేసు దర్యాప్తు చేశారు. ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి నిందితుడిని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

కాంట్రాక్టర్‌పై దాడి



కాంట్రాక్టర్ వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ గుజ్జు నారాయణపై గుర్తు తెలియని దుండగులు ఇనుప రాడ్లతో దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించారు. ఈ ఘటనతో పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సంతపేట వద్ద గల కార్యాలయంలో కాంట్రాక్టర్ నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కొందరు దుండగులు కిటికీ ద్వారా లోపలకు వచ్చి కాంట్రాక్టర్‌పై ఇనుప రాడ్లతో దాడి చేశారు. దీంతో అతను అపస్మారక స్థితికి చేరుకొన్నాడు. అనంతరం అతని వద్ద గల రెండు సెల్‌ఫోన్లను తీసుకుని కార్యాలయం తలుపులకు బయట నుంచి గడియపెట్టి అక్కడున్న బైక్‌ను దుండగులు తీసుకెళ్లిపోయారు. కాసేపయ్యాక మేలుకున్న కాంట్రాక్టర్ కిటికీ ద్వారా బయటకు వచ్చి సమీపంలోని ఒకరి నుంచి ఫోన్ తీసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. తీవ్రంగా గాయపడిన కాంట్రాక్టర్‌ని కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు కాంట్రాక్టర్ చికిత్స పొందుతున్న ప్రైవేటు ఆస్పత్రికి చేరుకున్నారు. కాంట్రాక్టర్ ఇచ్చిన వివరాలతో పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధి ఉమాజఠలేశ్వరునికి గులాబీలతో అలంకరణ

వానలోన.. ఈశ్వరార్చన

జోరువానలోన శివార్చన ఘనంగా జరిగింది. తుఫాన్ ప్రభావంతో చల్లటి గాలులు వీస్తున్నా, చిరు జల్లులు కురుస్తున్నా భక్తులు మాత్రం కార్తీక సోమవారం నాడు వేకువ నుంచి శివాలయాల ముందు బారులు తీరారు. ప్రముఖ శైవక్షేత్రాలతో పాటు ఊరూరా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పరమేశ్వరుడికి అభిషేకార్చనలు చేశారు.



టెక్కలి: ఎండల మల్లన్నకు పూజలు



జలుమూరు: శ్రీముఖలింగంలో ఆలయం ముందు వర్షంలో భక్తుల క్యూ



టెక్కలి: రావివలస మల్లన్న దర్శనానికి చెరువు గట్టు మార్గంలో వెళ్తున్న భక్తులు

బంగారం విడిపించుకునేందుకు..

- గార ఎస్‌బీఐకి క్యూ కడుతున్న ఖాతాదారులు
- ప్రతి రోజూ 10 నుంచి 15 మందికి తనఖా బంగారం విడిపించుకునేందుకు అవకాశం



బ్యాంకు గేటు వద్ద ఖాతాదారులను నిలువరిస్తున్న పోలీసులు

గార: స్థానిక ఎస్‌బీఐలో తనఖా పెట్టిన బంగారం విడిపించుకునేందుకు అధికారులు ఎట్టకేలకు అవకాశం ఇచ్చారు. సోమవారం ఉదయం బ్యాంకు తెరిచేసరికి చాలా మంది ఖాతాదారులు తమ బంగారం విడిపించేందుకు, వివరాలు తెలుసుకునేందుకు బ్యాంకుకు వచ్చారు. అయితే వివరాలు ఇవ్వలేమని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవని సిబ్బంది బదులిచ్చారు. దీంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. రీజనల్ మేనేజర్ రాజు కారును అడ్డగించారు. దీంతో ఇన్‌చార్జి డీఎస్పీ విజయకుమార్, పోలీసులు రంగ ప్రవేశం చేశారు. వివరాలు వెల్లడించేందుకు కౌంటర్‌ను పెట్టాలని, తనఖా విడిపించేందుకు అవకాశమివ్వాలని డీఎస్పీ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఖాతాదారులు తీసుకువచ్చిన రశీదు ద్వారా తనిఖీ చేసి బంగారం ఉంటే రైట్ గుర్తును, లేదంటే ఇంటు గుర్తును వేస్తున్నారు. పలువురు మహిళా ఖాతాదారులు బ్యాంకులోనే కన్నీటి పర్యంతమయ్యారు. అక్టోబర్ నెలలో పెట్టిన బంగారం మాయమైనట్టు తెలుస్తోంది. తక్కువ రోజుల్లో తనఖా పెట్టిన ఖాతాదారు అంత త్వరగా విడిపించరన్న అంచనాతో బంగారం మాయం చేసినట్టు ఉంది. పోయినవి కూడా 10 తులాలు పైబడి ఉన్న బంగారం సంచులే మాయమయ్యాయి. 11 మంది ఖాతాదారులకు డబ్బులు జమ చేశాక బంగారం ఇచ్చారు. ప్రతి రోజూ 10 నుంచి 15 మంది వరకు తనఖా విడిపించేందుకు అవకాశముందని బ్రాంచి మేనేజర్ రాధాకృష్ణ తెలిపారు.

పోలీసుల అదుపులో ప్రైవేటు వ్యక్తులు

బుడుమూరు చెందిన ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఇతని వద్ద నుంచి 27 తనఖా పెట్టిన బంగారం సంచులను పోలీసులు రికవరీ చేశారని, అదేవిధంగా శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు భోగట్టా. గార పోలీస్‌స్టేషన్‌లో బ్యాంకు సిబ్బందితో పాటు ఈ ఇద్దరు వ్యక్తులను డీఎస్పీ విజయకుమార్ విచారణ చేశారు. ఫిర్యాదులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. వీరి నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు.

విచారణ వేగవంతం

శ్రీకాకుళం క్రైమ్ : సంచలనం రేపిన గార ఎస్బీఐ బంగారం మాయం కేసులో పోలీసులు విచారణను మరింత వేగవంతం చేశారు. కేసులో ఉన్న కీలక వ్యక్తి, ఆత్మహత్యకు పాల్పడిన మహిళా బ్యాంకు ఉద్యోగిని సోదరుడు కిరణ్‌బాబును నగరంలోని సీసీటీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జి డీఎస్పీ విజయ్ కుమార్ విచారించి అతని స్టేట్‌మెంట్ తీసుకున్నారు. మాయమైన 86 బంగారు సంచుల్లో తన చెల్లెలు తరఫున 26 సంచులను తిరిగి బ్యాంకుకు చేర్చడంలో కిరణ్ పాత్ర చాలా స్పష్టం. దీంతో అతని స్టేట్‌మెంట్ కీలకమని పోలీసులు భావిస్తున్నారు. అంతే కాకుండా ఉదయం గారలో శ్రీకాకుళ ం ఆర్‌ఎం రాజు, మరో ముగ్గురిని డీఎస్పీ విచారించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికి ఏడుగురిపై ఎఫ్ ఐఆర్ నమోదు చేసి ఉన్నారు.

బ్యాంకు సిబ్బంది చెప్పడం లేదు



బ్యాంకులో 14 తులాల బంగారంను రూ. 5 లక్షల తీసుకొని తనఖా పెట్టాను. ఈ రోజు వివరాలు చూడగా మీ బంగారం లేదని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీనిపై ఏం చేస్తారని అడిగితే ఎవ్వరు సమాధానం చెప్పట్లేదు. ఖాతాదారులకు నమ్మకం కలిగేలా నిర్ణయం చేయాలి.

– కోరాడ అమ్మాజీరావు, కొర్లాం

దాచుకున్న బంగారం కనబడటం లేదు



కష్టపడి కొనుక్కొన్న బంగారం సొంత అవసరాల కోసం తనఖా పెడితే బంగారం కన బడటం లేదని సులువుగా చెబుతున్నారు. 11 తులాల బంగారాన్ని బ్యాంకులో ఉంచాను. ఎప్పుడిస్తారో చెప్పడం లేదు.

– బెండి లక్ష్మీ, అంబళ్లవలస

10న డైరెక్ట్ నేషనల్స్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: డైరెక్ట్ నేషనల్స్ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలతోపాటు రాష్ట్ర క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం మైదానం వేదికగా జరగనున్న ఈ ఎంపికలు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలిపారు. జిల్లాస్థాయి ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు మరిన్ని సందేహాలు, వివరాల కోసం 8500271575 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

పలు వయో విభాగాల్లో ఎంపికలు..

డైరెక్ట్ నేషనల్స్: డైరెక్ట్ నేషనల్స్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్తరప్రదేశ్ వేదికగా జనవరి నెలలో జరగనున్నాయి. ఈ పోటీలు అండర్-14, అండర్-16 వయో విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తహసీల్దార్ ఇచ్చిన జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఎంపికలకు హాజరుకావాల్సి ఉంటుంది.

క్రాస్ కంట్రీ స్టేట్‌మీట్: రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్-2023 పోటీలు తూర్పుగోదావరి సామర్లకోట వేదికగా ఈనెలాఖరులో జరగనున్నాయి. అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20, సీనియర్స్(మెన్, ఉమెన్) వయో విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

జిల్లాస్థాయి ఈ ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు తమ జనన ధ్రువీకరణ పత్రం, టెన్త్‌క్లాస్ పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాల్సి ఉంటుంది.

‘పథకాలు అర్హులకు చేరాలి’



రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

మందస: ప్రభుత్వ పథకాలపై సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు అవగాహన కలిగి ఉండాలని, పథకాలన్నీ అర్హులకు చేరాలని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. మందస మండలంలోని కుంటికోట సమీపంలో గల గిరిజన యూత్ శిక్షణ కేంద్రంలో సోమవారం నుంచి రిఫ్రెషర్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎలా అమలు చేయాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఉన్నత ఆశయంతో సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, గ్రామ స్వరాజ్యం దిశగా ఉద్యోగులు పని చేయాలన్నారు. మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం మూడు బ్యాచ్‌లు, సాయంత్రం మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు అనుసరించాల్సిన నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అరసాడ రఘుపతిరావు, ఏపీఎస్ఐఆర్డీ అండ్ పీఆర్ ఎస్.దేవి, నందిగాం, మందస మండలాల నుంచి 12 మంది మాస్టర్ ఆఫ్ ట్రైనీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గొల్లూరులో ఓటర్లతో మాట్లాడుతున్న నూరుర్ కమార్

నందిగాం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుర్ కమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న ఫారమ్-7లను పరిశీలించారు. గొల్లూరు, దిమ్మిడిజోల, పెంటూరు పోలింగ్ కేంద్రాలను ఆయన నందిగాం తహసీల్దారు వైవీ పద్మావతితో కలిసి సందర్శించి తొలగింపు దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. డీటీ భాగ్యలక్ష్మి, ఆర్ఐ కిరణ్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఆ చోరీ బీహారీ ముఠా పనే



ఇంట్లో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్‌లోని దంత వైద్యుని ఇంటిలో చోరీకి పాల్పడింది బీహార్‌కు చెందిన ముఠా అని పోలీసులు అనుమానిస్తున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా వీరు చోరీలకు పాల్పడుతారని పోలీసు అధికారులు అంటున్నారు. దొంగల కోసం గాలింపు చేస్తున్నామని సీఐ ప్రసాద్ తెలిపారు. మరో వైపు చోరీ సంఘటనపై టెక్కలి డీఎస్పీ భాల చంద్రారెడ్డి సోమవారం ఆరా తీశారు. నరసన్నపేట పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆయన డాక్టర్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సీఐ, ఎస్ఐలతో మాట్లాడి సీసీ ఫుటేజీలు పరిశీలించారు. అలాగే తమ ఇంట్లో చోరీకి గురైన బంగారు ఆభరణాలు 96 తులాలు ఉంటాయని, నగదు రూ. 4.5 లక్షలని డీఎస్పీకి తెలిపినట్లు వైద్యుడు గురుదేవ్ పేర్కొన్నారు. అయితే పోయిన బంగారం మొత్తం విషయంలో స్పష్టత లేకపోవడంతో కేసు నమోదు చేయడానికి సమయం పడుతున్నట్లు తెలుస్తోంది.

మందసలో అయోధ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

మందస:అయోధ్యలో నిర్మాణం జరుగుతున్న రామ మందిరానికి సంబంధించిన అక్షింతలను సోమవారం మందసలో ఊరేగించారు. జనవరి 22న ఆలయ ప్రతిష్ట జరుగుతోంది. దీనిలో భాగంగా అయోధ్య నుంచి శ్రీరాముని దివ్య అక్షింతలు శ్రీకాకుళం కేంద్రానికి చేరుకున్నాయి. అక్కడి నుంచి మందసకు చేరుకున్న వీటిని స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా జగన్నాథస్వామి ఆలయం తీసుకువెళ్లారు. అక్కడి నుంచి పంచాయతీలకు, గ్రామాలకు, భక్తులు ఇళ్లకు పంపించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు బెస్త కామేశ్వరరావు, ఇప్పిలి కేశవరావు(చిట్టి), రౌతు చిరంజీవరావు, కొంచాడ సురేష్‌కుమార్, కొమ్మాజోస్యుల సీతారామశర్మ, జగదీశ్‌పండా, దేవరశెట్టి కామేశ్వరరావు, శ్రీసత్యసాయి సేవాసమితి ప్రతినిధులు వూనా ఈశ్వరరావు, వడ్డి అప్పారావు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 15 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 15 వినతులు వచ్చాయి. డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని పాంద్ర మానుగూడకు చెందిన సవర రమేష్ కోరారు. చింతలగూడకు చెందిన తురకన్న ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాల రీసర్వే చేయాలని కోరుతూ పలువురు వినతిపత్రం అందజేశారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



గురువు జడ్డివాడుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ తర్ర లక్ష్మణరావు

కోటబొమ్మాళి: మండలంలోని తాలిపర్తి పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన గురువు జడ్డివాడు విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు పింఛన్ రావడంతో మహసాహెబ్‌పేట సచివాలయానికి చెందిన వలంటీర్ తర్ర లక్ష్మణరావు విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి మరీ సోమవారం పింఛన్ అందజేశారు. దీంతో వలంటీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పంట తడిచిపోతే..

- అధిక వర్షాలతో వరి రైతులు జాగ్రత్తలు పాటించాలి
- వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్ సూచనలు



ఆమదాలవలస మండలం కొత్తవలసలో వర్షానికి తడిసిన వరి పంట

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ జేడీ కె. శ్రీధర్ సూచించారు. జాగ్రత్తగా లేకపోతే నష్టాలను చవి చూడాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

- కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయరాదు.
- కోసినా పూర్తిగా ఆరని పనలను తుఫాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.
- కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5% ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలి.
- ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి.
- వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.
- కళ్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి.
- నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది.
- ఇలాంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటా ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు.
- ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలవ చేసుకోవాలి.
- రంగు మారి, తడిచిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు.
- పిగులు పొట్ట, పూత దశలో పైరు 1 నుంచి 2 రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం, పుష్పాలలో నీరు చేరడం వల్ల ఫలదీకరణ శక్తి కోల్పోతాయి. రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం + మాంకోజెబ్ లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారి చేయాలి.

పాలు పోసుకునే దశ

ఈ దశలో 2 నుంచి 3 రోజులకన్నా ఎక్కువగా పంట నీట మునిగితే పిండి పదార్థాలు గింజల్లో చేరక గింజ బరువు తగ్గి రంగు మారి, తద్వారా దిగుబడి, నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం + మాంకోజెబ్ లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారి చేయాలి.

- గింజ గట్టిపడే దశ నుండి కోత దశ చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలలో నష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేని బి.పి.టి 5204 వంటి రకాలు నీట మునిగితే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుంది. నిద్రావస్థ ఉన్న రకాల్లో కూడా చేను పడిపోయి వారం రోజులకన్నా ఎక్కువగా నీట మునిగితే గింజలలో నిద్రావస్థ తొలిగి చేనుపైనే మొలకవచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు 5% ఉప్పు ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేయాలి.
- గింజ తోడుకునే లేదా గట్టిపడే దశలో వెన్ను బరువువల్ల మొక్కలు కొద్దిపాటి గాలి, వర్షాలకే కణుపుల వద్ద విరిగి నేలకొరుగుతాయి. ఈ విధంగా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజలకు సరిగా చేరక గింజ బరువు తగ్గడం లేదా తాలు గింజలు ఏర్పడటం జరిగి, తద్వారా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పడిపోయిన చేల నుంచి వచ్చే ధాన్యం రంగు మారి, మిల్లింగ్ సమయంలో విరిగిపోయి, బియ్యంపై మచ్చ వచ్చే అవకాశం ఉంది. పడిపోయిన చేలలో యంత్రాలతో కోత కోయడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల కోతఖర్చు కూడా పెరుగుతుంది. నష్ట నివారణకు, పడిపోయిన చేలలో వీలైనంత తొందరగా దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టే చర్యలు చేపట్టాలి.